

## రెండున్నర కోట్ల అభిమానగణం

అగ్ర హీరో అల్లు అర్జున్ సోషల్‌మీడియాలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన్ని అనుసరించే అభిమానుల సంఖ్య 25 మిలియన్లకు చేరింది. ఈ స్థాయి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్న తొలి దక్షిణాది నటుడిగా బన్నీ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా అభిమానులకు కృతజ్ఞతలు చెప్పారాయన. 'పుష్ప' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపును సంపాదించుకున్నాడు అల్లు అర్జున్. ముఖ్యంగా ఉత్తరాది మాస్ ప్రేక్షకులకు బాగా చేరువయ్యారు. ఈ సినిమాలోని నటనకుగాను జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డును గెలుపొందడంతో బన్నీ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. దీంతో సోషల్‌మీడియాలో ఆయన అభిమానగణం కూడా పెరిగింది. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప-2' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. ఆగస్ట్ 15న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా అనంతరం అల్లు అర్జున్..త్రివిక్రమ్ లేదా అట్లీ దర్శకత్వం సినిమా చేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో కూడా ఆయన ఓ సినిమాకు అంగీకరించారు.

## మొకాళ్లపై మెట్లెక్కాను



అగ్ర కథానాయిక జాన్వీకపూర్‌లో భక్తి భావాలు చాలా ఎక్కువ. తిరుమల శ్రీవారిని తరచుగా దర్శించుకుంటుంది. ఎప్పుడు తిరుమల వచ్చినా అందుకు సంబంధించిన ఫొటోలను తన సోషల్‌మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకుంటుంది. ఈ నెల 6న తన జన్మదినం సందర్భంగా కాలినడకన ఆమె శ్రీవారి దర్శనం చేసుకుంది. జాన్వీకపూర్‌తో ఆమె స్నేహితుడు శిఖర్ పహారియా కూడా తిరుమల దర్శనం చేసుకున్నారు. ఈ యాత్ర విశేషాలను తన తాజా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది జాన్వీకపూర్. అందుకు సంబంధించిన ఓ వీడియోను కూడా పంచుకుంది. చెన్నైలోని తన స్వగృహం నుంచి బయలుదేరి తిరుపతికి మూడు గంటల్లో చేరుకున్నానని చెప్పింది. కాలినడక మార్గంలోని మొకాళ్ల మిట్ట వద్ద మొకాళ్లపై మెట్లెక్కానని చెప్పింది. ఇప్పటికీ యాభైసార్లు శ్రీవారిని దర్శించుకున్నానని, తనకెంతో ఇష్టమైన దేవాలయం ఇదని జాన్వీకపూర్ చెప్పింది. జాన్వీకపూర్ తల్లి దివంగత అందాల తార శ్రీదేవి కూడా శ్రీవారికి భక్తురాలే. ప్రతి ఏడాది ఆమె తిరుమల దర్శనం చేసుకునేది. ఇప్పుడు ఇదే సంప్రదాయాన్ని జాన్వీకపూర్ కొనసాగిస్తున్నది. ప్రస్తుతం జాన్వీకపూర్ తెలుగులో ఎన్టీఆర్ 'దేవర'తో పాటు ఇటీవలే ప్రారంభమైన రామ్‌చరణ్ 16వ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది.

## ఇదొక అద్భుతమైన రోజు



అగ్రనటుడు చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతోన్న 'విశ్వంభర' చిత్రం తొలి షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, త్రిష కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని టాకీ, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ని దర్శకుడు వశిష్ట తెరకెక్కించారు. ఈ సందర్భంగా చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణితో సహా మొత్తం బృందంతోపాటు త్రిష కృష్ణన్ కొన్ని ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేసింది. 'ఇదొక లెజెండరీ.. అద్భుతమైన రోజు..' అంటూ ఓ కామెంట్‌ని కూడా ఈ ఫొటోలకు జత చేసింది త్రిష. పనిలోపనిగా చిరంజీవి, త్రిష, వశిష్ట, కీరవాణి, విక్రమ్, వంశీ, చోటా కె.నాయుడు, ఏఎస్ ప్రకాశ్ తదితరులు ఉన్న మరో పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్‌ను యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. విక్రమ్, వంశీ ప్రమోద్ ఈ చిత్రానికి నిర్మాతలు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: చోటా కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వర రావు, సంతోశ్ కామిరెడ్డి, స్క్రిప్ట్ అసోసియేట్స్: శ్రీనివాస్ గవిరెడ్డి, గంటా శ్రీధర్, నిమ్మగడ్డ శ్రీకాంత్, మయూఖ్ ఆదిత్య.

## క్రెడిట్ అతనికి వస్తే స్నేహితుడిగా హ్యాపీనే!



'డీజే టిల్లు' చిత్రానికి కొనసాగింపుగా సిద్ధు జొన్నలగడ్డ చేసిన మరో ప్రయత్నం 'టిల్లు స్క్వేర్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన మల్లిక్‌రామ్ గురువారం విలేకరులతో ముచ్చటించారు. 'సిద్ధుతో నా పరిచయం ఈనాటిది కాదు. కెరీర్ కూడా కలిసే మొదలుపెట్టాం. కలిసి సినిమా చేయాలనే కోరిక ఎప్పటినుంచో ఉండేది. అయితే ఇద్దరం ఎవరి బిజీలో వాళ్లు ఉండిపోయాం. సిద్ధు హీరోగా బిజీ. నేను నరుడా డోనరుడా, అద్భుతం సినిమాల తర్వాత 'పెళ్లిగోల' అనే వెబ్‌సిరీస్ చేశాను. అది మంచి హిట్.' అని చెప్పారు. ఇంకా మాట్లాడుతూ 'ఓ విధంగా నాగవంశీ మా ఇద్దర్నీ కలిపారు. 'టిల్లు స్క్వేర్' చేస్తే బావుంటుందనే ఐడియా ఆయనదే. అదే టైమ్‌లో 'డీజే టిల్లు' దర్శకుడు విమల్‌కృష్ణ ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ నా దగ్గర కొచ్చింది. ముందు సంకోచించా. కథ నచ్చే సరికి ఓకే అనేశా.' అని చెప్పారు. మరికొన్ని విషయాలు ప్రస్తావిస్తూ ' 'డీజే టిల్లు' దర్శకుడి కంటే హీరోకే మంచి పేరు తెచ్చినమాట నిజం. ఈ సీక్వెల్ విషయంలో కూడా అదే జరిగితే నిజంగా నేను హ్యాపీనే. ఎందుకంటే ఇది సిద్ధు బ్రెయిన్ చైల్డ్. అతనికి ఈ కథపై ఓ పరిపూర్ణమైన అవగాహన ఉంది. ఈ పాత్ర ఎలా చేయాలో ఒక ఆలోచన ఉంది. అందుకే ఎక్కువ క్రెడిట్ అతనికి వస్తే ఒక స్నేహితుడిగా హ్యాపీనే. ఒకటి మాత్రం నిజం. దర్శకుడిగా నాకు ఎంత స్వేచ్ఛ ఇవ్వాలో అంతా ఇచ్చాడు సిద్ధు. నా కథలే కాదు, ఇతరుల కథల్ని కూడా నేను బాగా డీల్ చేయగలను. ఆ కెపాసిటీ నాకుంది. 'టిల్లు స్క్వేర్'తో అది రుజువుకానుంది' అని నమ్మకం వ్యక్తం చేశారు మల్లిక్‌రామ్. పేరుకు తగ్గట్టే 'డీజే టిల్లు'కు రెండింతలు ఎక్కువే ఈ సినిమా వినోదాన్ని పంచుతుందని, 'డీజే టిల్లు'లో రాధిక ఎంత పాపులర్ అయిందో, ఇందులో 'లిల్లీ' అంతకంటే ఎక్కువ పాపులర్ అవుతుందని, 'లిల్లీ'గా అనుపమ పరమేశ్వరన్ నటన ఇందులో హైలైట్ అని, సాంకేతికంగా అన్ని విభాగాలు అభినందనీయంగా ఉంటాయని ఆయన తెలిపారు.

## 'రామాయణం' మరింత ఆలస్యం..



భారతీయ ఇతిహాసం 'రామాయణం' మరోమారు వెండితెర దృశ్యమానం కాబోతున్న విషయం తెలిసిందే. నితేష్ తివారి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో రాముడిగా రణబీర్‌కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి నటించనున్నారు. మూడు భాగాలుగా భారీ వ్యయంతో తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి అగ్ర నిర్మాత అల్లు అరవింద్ నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 17న అధికారికంగా ప్రకటిస్తారని వార్తలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం చిత్ర బృందానికి సంబంధించి కొన్ని అంతర్గత సమస్యల కారణంగా ఈ సినిమా మరింత ఆలస్యం కానుందని, ఈ ఏడాది పట్టాలెక్కేది అనుమానమేనని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. కొన్ని సృజనాత్మక విభేదాలతో పాటు సాంకేతిక అంశాల విషయంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం కావడంతో తొలుత వాటిని పరిష్కరించుకునే దిశగా చిత్ర బృందం ప్రయత్నాలు చేస్తున్నదని తెలిసింది. అయితే ఈ వార్తల్లో నిజాలేమిటో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే అంటున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ సినిమాలో వివిధ భాషల అగ్ర నటులు భాగం కాబోతున్నారు. రావణాసురుడి పాత్రలో కన్నడ అగ్ర నటుడు యష్ నటించనున్నారని వార్తలొచ్చాయి. తాజా వదంతుల నేపథ్యంలో ఈ సినిమా సెట్స్‌మీదకు రావడం మరింత ఆలస్యం కావొచ్చని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్నది.

## మనసుల్ని తాకే శశివదనే..



రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన చిత్రం 'శశివదనే'. సాయిమోహన్ ఉబ్బర దర్శకుడు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి గోడల నిర్మాతలు. నిర్మాణంలో తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ చిత్రం వచ్చే నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 'విడుదలైన ప్రచార చిత్రాలు ఎంత సున్నితంగా అనిపిస్తున్నాయో, సినిమా కూడా అంత హార్ట్ టచింగ్‌గా ఉంటుంది. ఇలాంటి గొప్ప కథతో దర్శకుడ్ని కావడం నా అదృష్టం. సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను.' అని దర్శకుడు అన్నారు. భావోద్వేగాల మేళవింపుగా ఈ సినిమా ఉంటుందని, దర్శకుడు సాయిమోహన్ ఈ సినిమాతో పెద్ద దర్శకుడు అవుతాడని, సాంకేతికంగా కూడా ఈ సినిమా అందరికీ నచ్చుతుందని హీరో రక్షిత్ చెప్పారు. ఇంకా చిత్రయూనిట్ మొత్తం మాట్లాడారు. శ్రీమాన్, దీపక్ ప్రిన్స్, జబర్దస్త్ బాబీ, రంగస్థలం మహేశ్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీసాయికుమార్ దారా, సంగీతం: శరవణ వాసుదేవన్, నేపథ్యసంగీతం: అనుదీప్‌దేవ్.

## అడవి నేపథ్యంలో

అప్సరరాణి ప్రధానపాత్రలో రూపొందిన చిత్రం 'తలకోన'. నగేశ్ నారదాసి దర్శకుడు. దేవర శ్రీధర్‌రెడ్డి నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయివెంకట్, డీఎస్‌రావు, నటుడు రమాకాంత్, పార్థురెడ్డి తదితరులు అతిథులుగా విచ్చేసి చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. అప్సరరాణి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన సినిమా అని, ఫారెస్ట్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో యువతరానికి నచ్చే అంశాలన్నీ ఉంటాయని నిర్మాత తెలిపారు. చూడటానికి అప్సరరాణి కశ్మీర్ యాపిల్‌లా కనిపిస్తుందని కానీ, ఈ సినిమాలో కశ్మీర్ మిర్చిలా నటించిందని దర్శకుడు చెప్పారు. తన కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిలా నిలుస్తుందని అప్సరరాణి నమ్మకం వెలిబుచ్చింది. ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్, సంగీతం: సుభాష్ ఆనంద్.





## పదిరోజులు కరెంట్ పోతే..?

గాలి, నీరు, ఆహారం ఈ మూడూ లేకపోతే ఎలాగైతే బతకలేమో, కరెంట్ లేకపోయినా ప్రస్తుతం అలాగే బతకలేం. అలా తయారైంది సమాజం. అలాంటిది ఓ గ్రామంలో పదిరోజుల పాటు కరెంట్ ఉండదు. మరి ఆ ఊరు జనం పరిస్థితేంటి? కరెంట్ పోవడానికి కారణం ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానమే మా 'లైన్‌మ్యాన్' అంటున్నారు హీరో త్రిగుణ్. ఆయన హీరోగా రఘుశాస్త్రి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా త్రిగుణ్ మీడియాతో ముచ్చటించారు. కథే ఈ చిత్రానికి ప్రధానబలమని, కథ నచ్చే ఈ సినిమా చేశానని, వినోదంతోపాటు చక్కని సందేశం కూడా ఇందులో ఉంటుందని త్రిగుణ్ తెలిపారు. 'నిజానికి ఈ సినిమాను రాక్ ఎంటర్‌టైనర్స్‌వారు కన్నడంలో చేయాలనుకున్నారు. నాకు తెలుగులో కాస్త మంచిపేరు ఉందని తెలుగులో కూడా విడుదల చేయాలని డిసైడ్ అయ్యారు. నటుడిగా 15ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్నాను. ఇకనుంచి కథల విషయంలో కొత్తగా వెళ్లాలనుకుంటున్నాను. వెబ్ సిరీస్‌లో నటించడానికి కూడా వెనుకాడను. 'లైన్‌మ్యాన్' తర్వాత మరికొన్ని ప్రాజెక్టులు లైనప్‌లో ఉన్నాయి.' అన్నారు త్రిగుణ్.



## క్రైమ్ కామెడీ 'పారిజాత పర్వం'



చైతన్యరావు, సునీల్, శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పారిజాత పర్వం'. సంతోష్ కంభంపాటి దర్శకుడు. వనమాలి క్రియేషన్స్ పతాకంపై మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ టీజర్ ఆద్యంతం నవ్వుల్ని పంచింది. దర్శకుడు మట్లాడుతూ 'క్రైమ్ కామెడీ కథాంశమిది. వినోదంతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. సునీల్ పండించే హాస్యం హైలైట్‌గా నిలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ఏప్రిల్ 19న విడుదల చేస్తున్నాం' అన్నారు. మాళవిక సతీషన్, వైవా హర్ష, శ్రీకాంత్ అయ్యంగార్, సురేఖవాణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: బాలసరస్వతి, సంగీతం: రీ, రచన-దర్శకత్వం: సంతోష్ కంభంపాటి.

## సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో..



యశ్వంత్, సాయితేజ, ఆరుషి, నిఖిల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఊర శ్రీనివాస్ దర్శకుడు. కారుణ్య శ్రేయాన్స్ ఫిలింస్ పతాకంపై పోతురాజ్ నర్సింహారావు, కె.సాయి తేజ నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్‌నివ్వగా, రచయిత బిక్కి కృష్ణ కెమెరా స్విఛాన్ చేశారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశమిదని, అందరిని ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమా ద్వారా తమ అబ్బాయిని హీరోగా పరిచయం చేస్తున్నామని నిర్మాత పోతురాజు నర్సింహారావు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్, సంగీతం: శ్రీధర్ ఆత్రేయ, సంభాషణలు: దాసరి వెంకటకృష్ణ, దర్శకుడు: ఊర శ్రీను.



## ఎర్రచందనం చీర కడితే.. రాయికూడా రాకుమారే..

సెకండ్‌పార్ట్‌లో పుష్పరాజ్ గంధపుచక్కల స్మగ్లింగ్ చేసి బాగా సంపాదించేసినట్టున్నాడు. ఒంటినిండా బంగారంతో శ్రీవల్లిని చూస్తుంటే ఎవరికైనా ఇలాంటి ఫీలింగ్ కలుగుతుంది. ఓవైపు భన్వర్‌సింగ్ షకావత్‌తో గొడవ, మరోవైపు గంధపుచక్కల పంచాయితీ. ఈ కథ ఏ దిక్కు నుంచి ఏ దిక్కుకు చేరుతుందో చూడాలి. ఈ సినిమా షూటింగ్ యాగంటిలో జరగబోతున్నదని రీసెంట్‌గా తన ఇన్‌స్టా ద్వారా లీక్ చేసింది శ్రీవల్లీ అలియాస్ రష్మిక మందన్నా. దీనికి తగ్గట్టే 'పుష్ప 2' లొకేషన్ ఫొటో ఒకటి సోషల్‌మీడియాలో ప్రస్తుతం హల్‌చల్ చేస్తున్నది. ఈ ఫొటోలో రష్మిక సంప్రదాయబద్ధంగా ఎరుపురంగు చీర ధరించి, ఒంటినిండా బంగారు ఆభరణాలతో మెరిసిపోతున్నది. గొడుగు పట్టి మరీ ఈ అందాలరాశిని షూట్‌కి చిత్రబృందం తీసుకొస్తున్న తీరు చూస్తుంటే, నిజంగా మహారాణినే తలపిస్తున్నది రష్మిక. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. ఇలాంటి ఫొటోల వల్ల సినిమా ఆసక్తి ఇంకా రెట్టింపయ్యే అవకాశం లేకపోలేదు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్ట్ 15న విడుదల కానున్న విషయం తెలిసిందే.